చర్మం ఏ రంగుదైనా స్పర్శ ఒక్కటే... అన్నట్టు పాదాల దగ్గర అప్పుడే చీమ కుట్టింది.

ఆ చీమని కొనగోటితో తప్పించింది కాని... దాన్ని చంపాలన్పించలేదు. ఆ సాయంత్రం... పెళ్ళి చూపులకు వాళ్లొచ్చారు... సులోచన నిండుగా తయారై కూచుంది. తలొంచినా... కనురెప్పలు పైకెత్తి అబ్బాయిని చూసింది.

నిజంగా ఎంత అందగాడు?

ముఖ్యంగా ఎంత తెల్లగా ఉన్నాడు?

అతడి పక్కన తను... కాకి ముక్కున దొండపండులా... ఛ... ఈ సామెత్తల్ని ఎవడు కనిపెట్టాడోగాని... ప్రతిదానికి గుర్తొచ్చి కత్తిలా కోస్తాయి.

అతడి తల్లి పెప్తోంది.

"మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చింది. వాడికే కదా. మాక్కూడా కట్న కానుకల ఆసక్తి లేదు. మా వాడు మీ అమ్మాయికి నచ్చితే ముహూర్తాలు పెట్టిద్దాం" అంది. ఆ మాట విని వాళ్ళకి కొంతసేపు ఏమీ అర్థం కాలేదు. తేరుకోవడానికి ఐదు నిమిషాలు పట్టింది.

ఆ తర్వాత ఆనందం, ఆశ్చర్యం కలగలిపి మంచాంగం పుటలు తెరిపించారు. పదిహేను రోజుల్లో పెళ్ళి ముహూర్తం పెట్టారు.

సులోచన సీతాకోకచిలుకే అయింది. కక్కొచ్చినా... కళ్యాణమొచ్చినా మాటమాటికీ గుర్తొస్తుంటే ఛ... వెధవ సామెత ఇలా వెంటాడుతోంది. అనుకుంది అందంగానే.

మర్నాడు చుట్టుపక్కల ఛనెల్స్ అన్నీ తెరుచుకున్నాయి.

వాళ్ళ లైవ్ కాస్టకి... ఇంటిల్లిపాది బెదిరిపోయారు.

'బొగ్గులా ఉన్న అమ్మాయిని కానీ కట్నం లేకుండా ఎందుకు చేసుకుంటారు? ఏదైనా మాయదారి రోగం ఉందేమో?"

"లేదా ఇదివరకే పెళ్ళయి ఏమైనా అయిందేమో?"

"అందం, ఆస్తి, ఉద్యోగం ఉన్న కుర్రాడు రంగులేదని ఇరవై సంబంధాలు తప్పిన అమ్మాయిని ఊరికే చేసుకోవమేంటి? ఇందులో ఏదో తిరకాసుంది."

"అదంతా పెళ్ళయ్యాక బయటపడితే... అమ్మాయి బతుకు ఘోరం" అన్నీ విన్నాక సలోచనకికూడా నిజమే అన్పించింది. అతడు తనను ఒప్పుకోవడం వెనుక మరేదైనా అంతర్యంవుందా?

మనసునిండా భయం పేరుకుపోయింది.

అతడిపట్ల ఏదో భావన... అనుమానం.. అప్పటికే పెళ్ళి ముహూర్తం దగ్గర పడింది. పెళ్ళిలో అతడు మూడుముళ్ళు వేస్తుంటే గజగజా వణికిపోయింది. గుండె చికబట్టుకొని శోభనం గదిలోకి వెళ్ళాక సులోచన అడిగిన మొదటి ప్రశ్న.

